క్లుప్తంగా

మొక్కజొన్న పంట పరిశీలన

పాచిపెంట: మండలంలోని కొండమోసూరు, గుమ్మిడివలస, మూలపాడు, దొరలుద్దంగి గ్రామాల్లో సాగవుతున్న పంటలను ఏఓ తిరుపతిరావు శనివారం పరిశీలించారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, పంటల సాగును పరిశీలించారు. మొక్కజొన్న పంటలో ఆశించిన కత్తెర పురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. చెక్‌డ్యాంలు మరమ్మతులకు గురయ్యాయని జెడ్పీ వైస్‌చైర్మన్ జన్ని సింహాచలం, కేరంగి సర్పంచ్ లచ్చయలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏఓ తెలిపారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల వాల్‌పోస్టర్ల విడుదల



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోస్టర్ విష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో మార్చి 23వ తేదీన నిర్వహించనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే విజయ్‌చంద్ర తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. యువత శారీరక దారుఢ్యం, ఆరోగ్యం కోసం సాధన చేయడం మంచి అలవాటుని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పోటీలు విజయవంతం అయ్యేందుకు అంతా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. పోటీలకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు, యువత పాల్గొన్నారు.

ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న శివాలయం



తాళ్లబురిడిలో ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న శివాలయం

పార్వతీపురం: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం ప్రతిష్ఠకు సిద్ధమవుతుంది. గ్రామంలో గంగా, పరమేశ్వరుని శివాలయం ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 15 నుంచి 17వరకు మూడు రోజుల పాటు పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బలగ నాగేశ్వరరావు తెలిపారు. ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, అభిషేకాలు అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయాలపై సమాచారమివ్వండి



ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: అక్రమంగా బెల్ట్‌షాప్‌లు నిర్వహించినా, సారా, గంజాయి రవాణాలు చేపట్టినా 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ దాసు కోరారు. పట్టణంలో తన కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. మద్యం అక్రమ విక్రయాలు, గంజాయి, సారా విక్రయాలు, రవాణా తదితర అంశాలపై శాఖాపరంగా ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మద్యం అక్రమ విక్రయాలు, గంజాయి, సారా విక్రయాలు, రవాణాలు నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ముందస్తు తీర్మానాలు అంగీకరించం..

- స్పష్టం చేసిన ఎంపీటీసీ సభ్యులు

పాలకొండ: మండల పరిషత్‌కు సంబంధించి ఎంపీ పీ బొమ్మాళి భాను చేపట్టిన ముందస్తు తీర్మానాల ను అంగీకరించమని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ విజయరంగారావులను శనివారం కలిసి వినతి పత్రాలు అందజేశా రు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. మెజారీ సభ్యులుగా ఉన్న తమ విశ్వసం కోల్పోయిన ఎంపీపీ తీర్మానాలను అంగీకరించబోమన్నారు. పంచాయతీరాజ్ చట్టం 1994–సబ్ క్లాజ్ అనుసరించి విశ్వాసం కోల్పోయిన అధ్యక్షులు చేపట్టిన పాలనాపరమైన ఎటువంటి తీర్మానాలు చెల్లవని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యులు కోట అజయ్‌బాబు, పిన్నింటి లక్ష్మి, నిమ్మక దుర్గమ్మ, పాండ్రంకి హైమావతి, వారాడ సరస్వతి, కనపాక చిన్నమ్మలు, కోఆప్షన్ సభ్యుడు నేపాకుల మురళీధర్ ఉన్నారు.

ఇప్పటికింతే...!

- టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ రానట్టే..
- వంద రోజుల ప్రణాళికలో అందని ఫైనం
- విద్యార్థుల్లో గందరగోళం

బలిజిపేట:

పదో తరగతి విద్యార్థులు వార్షిక ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. అయితే విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ మాత్రం నేటికీ పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసింది. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెటీరియల్ పంపిణీ చేస్తామని ప్రకటించినా నేటికి విద్యార్థులకు అందలేదు. దీంతో ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులు వాటిని తయారుచేసి వారికి బోధిస్తున్నారు.

మిగిలేవి తక్కువ రోజులు మాత్రమే..

మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలు రాయడానికి ఇంకా వారికి తక్కువ సమయం ఉంది. మెరుగైన ఫలితాల సాధన దిశగా వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేశారు. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి వాటిని పంపిణీ చేయకపోవడంతో ఎప్పుడు వస్తుందా.. అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో సగం పైగా రోజులు గడిచిపోయాయి. ఇంకా మిగిలినవి కొద్ది రోజులు మాత్రమే.



పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులు

గతంలో ఏం చేశారంటే..

గత ప్రభుత్వంలో పరీక్షలకు రెండు, మూడు నెలలకు ముందే విద్యాజ్యోతి పేరుతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి పిల్లలకు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వంద రోజుల ప్రణాళికతో పాటు మెటీరియల్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఇంతవరకు పంపిణీ చేయలేదు. ఈ పరిస్థితుల్లో సత్ఫలితాలు ఎలా సాధ్యమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఒక ప్రణాళిక సిద్ధం చేసినప్పుడు దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధ్యమేనని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపిందని వారు అభిప్రాయపడుతున్నారు. నేటి పాలకులు ప్రణాళికలు సిద్ధం చేయడం తప్ప అమలు చేయడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులు ఇలా:

ఉపాధ్యాయులు విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం ప్రతీ రోజూ విద్యార్థులకు అసైన్‌మెంట్స్, మాక్ టెస్టులు పెడుతూ ఉదయం 8.15 నుంచి 9.15గంటల వరకూ, సాయంత్రం 4నుంచి 5గంటల వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు వంతున వారంలో 5 సబ్జెక్టులకు బోధన అందించి రివ్యూ చేస్తున్నారు. అదే విధంగా ప్రభుత్వం రూపొందించిన పీడీఎఫ్ ఫైల్‌ను ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు బోధిస్తున్నారు.

ఫీజు వసూళ్లకు పోటీ పడుతున్న విద్యా సంస్థలు

పార్వతీపురం టౌన్: ప్రాక్టికల్ ఫీజు వసూళ్లకు విద్యా సంస్థలు పోటీ పడుతూ విద్యార్థులకు ఇబ్బందులు పెడుతున్నాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ ఆరోపించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఈ నెలలో ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. దానికి సంబంధించి ప్రాక్టికల్ రుసుము ఎటువంటిది వసూలు చేయకూడదని ప్రభుత్వ జీఓలు ఉన్నప్పటికీ. జీఓలను తుంగలో తొక్కి విచ్చలవిడిగా డబ్బులు వసూలుకు విద్యా సంస్థలు పాల్పడుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు.

విద్యార్థుల నుంచి సుమారుగా రూ.1200 నుంచి రూ.2200 వసూలు చేయడం, వస్తున్న ఇంటర్నల్‌కి ఈ డబ్బులు పంచాలి అనడం ఈ ప్రభుత్వ వైఫల్యమన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, విద్యాసంస్థల యాజమాన్యాలు కాకుండా విద్యార్థులని అడిగి సమస్యలు తెలుసుకోవాలన్నారు. లేనట్లయితే ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

లోక్‌అదాలత్‌లతో కేసుల రాజీ

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: కోర్టులో పెండింగ్ కేసులను రాజీ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు సూచించారు. మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి తీసుకునే చర్యలపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్, క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు అధిక మొత్తంలో రాజీ కుదిర్చేలా కృషి చేయాలన్నారు. కోర్టులో ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల కక్షిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్జి అన్నారు. రాజీ చేయడం ద్వారా కక్షిదారులకు శ్రమ, ఖర్చుల నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, పార్వతీపురం పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోవింద, రూరల్ ఇన్‌స్పెక్టర్ సంతోషికుమారి, గరుగుబిల్లి ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయుడు, ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ రేవతమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొర్లె వెంకటరావు, న్యాయవాదులు ఎం.వెంకటరావు, ఎస్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగుపై తస్మాత్...



లక్ష్మీపురంలో జొన్న చేనులో తెగుళ్ల నివారణకు పిచికారీ చేస్తున్న రైతు

సీతానగరం: మండలంలోని మాగాణి భూముల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశిస్తున్న కారణంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస గ్రామాల్లో జొన్న చేను పంటలో కత్తెర పురుగు ఆశించడాన్ని శనివారం ఆయన గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచు విపరీతంగా కురవడం, పంట ఏపుగా పెరగడం వల్ల ఆకులపై రాత్రివేళల్లో కత్తెర పురుగులు ఆశించి ఆకులను కత్తిరించిన మాదిరిగా తినేస్తున్నాయని తెలిపారు కత్తెర పురుగులు చేరిన తరువాత మొవ్వను అడ్డదిడ్డంగా తినేస్తాయని, దీని నివారణకు ఎమోమెక్టిన్ బెంజాయిట్ మందును పిచికారీ చేయాలని సూచించారు. జొన్న చేనులో ఆకులు ఎర్రబారితే మల్టీకే ఎకరాకు 1 కేజీ మందు 200లీటిలో కలిపిన మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తే చేనులో నీరును తట్టుకుని చేను ఏపుగా పెరుగుతుందన్నారు.

నిత్యం అవస్థలే..

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది బ్రిడ్జి వద్ద కుళాయిలకు నీరు అందించే వాటర్ సంప్ ద్వారా నీరు లీకవడంతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జ్ శ్లాబు మరమ్మతులు గురైనప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప కనీసం మరమ్మతులు చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మక్కువ మండలంలో పర్యటించిన సమయంలో మక్కువ నుండి దుగ్గేరురోడ్డు మధ్యలో గోతులను పూడ్చి వేసినప్పటికీ, బ్రిడ్జిపై ఏర్పడ్డ గోతులను పూడ్చివేయలేదు. దీంతో వాటర్ సంప్ ద్వారా లీకైన నీరు బ్రిడ్జిపై నిలిచిపోవడంతో, గొయ్యి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చి వేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే సంప్ ద్వారా లీకవుతున్న నీటిని అరికట్టాలని కోరుతున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఎరువు తయారు చేయండి



సంతోషపురం ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రం)ల్లో ఎరువు తయారు చేసి, వాటిని సబ్సిడీపై రైతులకు ఇచ్చి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. మండలంలోని సంతోషపురం, పెదగుడబ పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఆమె శనివారం సందర్శించారు. ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తాచెదారాన్ని ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించి, వర్మీకంపోస్ట్(ఎరువు) తయారు చేయాలన్నారు.

ఈ రహదారిలో ప్రయాణమెలా..!



రాళ్లు తేలిన రోడ్డు

మక్కువ: మండలంలో డి.శిర్లం గ్రామం నుంచి దబ్బగెడ్డ గ్రామం వరకు రహదారి మొత్తం రాళ్లు తేలిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై మెటల్ వేసి వదిలేయడంతో రాళ్లు మొత్తం తేలిపోయాయి. రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. లోవరఖండి గ్రామ సమీపంలోని రహదారిపై మెటల్ వేయకపోవడంతో ఆ ప్రదేశమంతా మట్టి రహదారి గోతులమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని బాగు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వండి



సీతానగరం ఉన్నత పాఠశాలల్లో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కోరెడ్ల విజయగౌరీకి ఉపాధ్యాయులు మద్దతుగా నిలిచి ఆమె విజయానికి సహకరించాలని యూటీఎఫ్ కోరింది. మండలంలో గాదెలవలస, ఆర్.వెంకంపేట, సీతానగరం, బూర్జ, నిడగల్లు, మరిపివలస ఉన్నత పాటశాలలు, జోగింపేట కేజీబీవీ, గిరిజన ప్రతిభ పాఠశాలలో శనివారం యూటీఎఫ్ సంఘ సభ్యులు విస్తృత ప్రచారం నిర్వహించారు. విజయగౌరీని గెలిపించాలని కోరారు.

ఉపాధ్యాయ, విద్యా సమస్యల పట్ల సుదీర్ఘ పోరాటం చేస్తున్న విజయగౌరీని శాసనమండలికి పంపించడం ద్వారా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందన్నారు. ఆ సంఘం నేతలు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, ఎ.పోలినాయుడు, ఎం.గోవిందరావు, టి.అప్పలనాయుడు, బి.ఆదినారాయణ, కె.మురళి, సీహెచ్ గణపతి, జి.దాలయ్య, జె.సింహాచలం, బి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జోగారావుకి సత్కారం



మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావును సత్కరిస్తున్న వివిధ విభాగాల అధ్యక్షులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇటీవల పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులకు, జిల్లా స్థాయి పార్టీ పదవుల దక్కడంతో వారంతా ఆయనను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పార్టీ బతోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, ఎంపీపీ మజ్జి శోభారాణి, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర అనుబంధ విభాగాల సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతానగరం: మండలంలోని ఐసీడీఎస్ పీఓ సురేఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న న్యూట్రిషన్ కిట్లు సకాలంలో వినియోగించుకోవాలని నిడగల్లు సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ సూచించారు. నిడగల్లులో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు టీచర్స్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ముందు జాగ్రత్త చర్యగా రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టామన్నారు. గర్భిణులకు మునగ ఆకులు, బిస్కెట్లు, న్యూట్రిషన్ ఆహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జోగారావు




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన స్వగృహంలో అర్బన్, రూరల్, జిల్లా, నియోజకవర్గాల పార్టీ ప్రతినిధులతో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఓటమి చెందిన విషయం అప్రస్తుతం అని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన ఆవశ్యకత మన అందరిపై ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా మీరంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రతీ గ్రామం, వార్డులలో సందర్శించి ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కలుసుకోవడం జరుగుతుందన్నారు. పార్టీని క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలని అన్నారు. పార్టీ శ్రేణులు అంతా ఒక్కటై పార్టీని ముందుకు నడిపించాలని, భవిష్యత్ మనదేనని అన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, ప్రధాన కార్యదర్శి తప్పిట ప్రసాద్, మూడు మండలాల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టి రాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండిపూరు గున్నేశ్వరరావు, వైస్ ఎంపీపీలు, జిల్లా పార్టీ ప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి వివిధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర స్థాయి విభాగాల అధ్యక్షులు పార్వతీపురం మండలం, అర్బన్ ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి అక్రమ సస్పెన్షన్ ఎత్తేయాలి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో కొత్తవలస మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సత్యనారాయణ అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యను ఉపాధ్యాయుడిపై నెట్టి, ఏ తప్పు లేదని విచారణలో తేలినప్పటికీ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. పాఠశాల సమయానికి ముందే తల్లిదండ్రులు, విద్యార్థులు, కార్మిక నాయకులు నిరసన చేపట్టారని, ఇందులో ఉపాధ్యాయుడిని ఇరికించి సస్పెండ్ చేయడమేమిటని ప్రశ్నించారు. పాఠశాల వద్ద ధర్నా చేయవద్దని సమస్యపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకే నేను నడుచుకుంటానని తల్లిదండ్రులకు చెప్పినపుడు ఆ ఫొటోను ఎవరో తీస్తే దానిని ఆధారంగా చేసుకొని సస్పెండ్ చేయడం కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నాన్నారు. రెండు రోజుల్లోగా సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని జిల్లా విద్యాశాఖాదికారికి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.రమేష్, కె.భాస్కరరావులు తెలిపారు.

1/70 చట్టంపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్న

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. కురుపాం మండలంలోని పోరాండంగూడలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.లింగరాజు ఆధ్వర్యంలో గిరిజనులతో శనివారం సమావేశమైన ఆయన.. విశాఖపట్నంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టం సవరించాలంటూ స్పీకరు అయ్యన్నపాత్రుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తోందన్నారు. 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనులకు భూములు దక్కకుండా పోతాయని, ఏజెన్సీలో లభించే సహజ వనరులు కార్పొరేట్ శక్తుల పాలవుతుందన్నారు. పోరాటాల ఫలితంగా గిరిజనులు సాధించుకున్న చట్టాల సవరణకు ఒడిగడితే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పీకరు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, ఎం.సింగన్న, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

- నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక రేపు

పాలకొండ: నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో అంతటా ఈ ఎన్నికపైనే చర్చ సాగుతోంది. వాస్తవానికి చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి (19వ వార్డు కౌన్సిలర్) ఇటీవల రాజీనామా చేశారు. ముందుగా 19వ వార్డు కౌన్సిలర్ స్థానానికి ఎన్నిక నిర్వహించిన తర్వాతే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే అధికారులు ఈ వార్డులో ఎన్నిక చేపట్టకుండానే చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించాలని ఏర్పాట్లు చేయడం విశేషం. చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వేషన్ కావడంతో ఆ సామాజికవర్గానికి చెందిన కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి ఒక్కరే ఉన్నారు. అయితే ప్రస్తుత కౌన్సిలర్లు ఆమెను ఎన్నుకునేందుకు ఆసక్తి కనబడడం లేదని తెలుస్తోంది. మరో వైపు 20 వార్డుల్లో 17 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకి చెందినవారే. మల్లీశ్వరి కూడా వైఎస్సార్‌సీపీ నుంచే గెలిచి ఇటీవల టీడీపీలో చేరారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వైస్ చైర్మన్ పల్లా ప్రతిప్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్నిక ఎలా నిర్వహిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కౌన్సిలర్లతో మంతనాలు చేస్తున్నారు. పార్టీ తీసుకునే నిర్ణయం మేరకు వీరు ఎన్నికకు వెళ్లాలా, వద్దా అనేది తేలుతుంది. మరోవైపు టీడీపీ నాయకులు మల్లీశ్వరిని చైర్‌పర్సన్ చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ ఉత్కంఠ వీడాలంటే ఒక రోజు వేచి ఉండాల్సిందే.